నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | మంగళవారం 13 ఫిబ్రవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


# సమన్వయంతో పరిష్కరిస్తాం

**మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్**



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, ఫిబ్రవరి 12 : ప్రజావాణిలో వచ్చిన సమస్యలను అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తామని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల, మందమర్రి, లక్షెట్టిపేట, జన్నారం, కన్నెపల్లి, తాండూర్, బెల్లంపల్లి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వారు దరఖాస్తులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామని, రాష్ట్ర స్థాయిలో అందిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్ సహదేవరావు



బెల్లంపల్లి సీవోఈ ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న గురుకుల ఉద్యోగులు

# నల్ల బ్యాడ్జీలతో గురుకుల ఉద్యోగుల నిరసన

బెల్లంపల్లిరూరల్, ఫిబ్రవరి 12 : గురుకులాల్లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం బెల్లంపల్లిలోని బాలురు, బాలికలు, కాసిపేట బాలుర గురుకుల కళాశాలల ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని కోరారు. తక్షణమే ప్రమోషన్లు ఇవ్వాలని, ఖాళీల భర్తీకి నూతన నియామకాలు చేపట్టాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని, గురుకుల ఉపాధ్యాయులకు ఫ్యారిటీ స్కేల్ వర్తింపజేయాలని, జీవో నం.317కు తక్షణమే పరిష్కారం చూపించాలని వారు డిమాండ్ చేశారు. 2007లో రెగ్యులర్ అయిన ఉద్యోగస్తులందరికీ సంస్థలో జాయిన్ అయిన రోజు నుంచి సర్వీస్‌ను లెక్కకట్టి నోషనల్ ఇంక్రిమెంట్‌లు ఇవ్వాలని, ఓపీఎస్ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. హాలిడే డ్యూటీలకు ప్రత్యామ్నయంగా వీక్లీ ఆఫ్‌లు ఇవ్వాలని, అన్ని డిగ్రీ కళాశాలల్లో ఏవో పోస్టులను నియమించాలని, అన్ని కళాశాలల్లో డిప్యూటీ వార్డెన్ పోస్టులను మంజూరు చేయాలని, అకారణమైన సస్పెన్షన్లు ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు.



విల్సన్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

# బాలికను కాపాడిన బీఆర్ఎస్ నాయకునికి సన్మానం

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 12 : కిడ్నాప్‌నకు గురైన బాలికను కాపాడిన బీఆర్ఎస్ నాయకుడిని సోమవారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఘనంగా సన్మానించారు. పట్టణంలోని 10వ వార్డులోగల శ్రీనివాస గార్డెన్ ఏరియాలో నివాసముంటున్న సాయిప్రకాశ్ ఇంటికి మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు చెందిన మహేశ్, అశ్విని దంపతులు తమ పాప అదితితో కలిసి వచ్చారు. ఆదివారం సమ్మక్క మొక్కుల అనంతరం దగ్గరలో ఉన్న అపార్ట్‌మెంట్‌ను చూసేందుకు అంతాకలిసి వెళ్లారు. ఆ సమయంలో పాప అపార్ట్‌మెంట్ ముందున్న ఆటస్థలంలో ఆడుకుంటుండగా.. దేవాపూర్‌కు చెందిన సుమిత్ర ఆమెను ఎత్తుకొని పారిపోతున్నది. ఈ విషయాన్ని గ్రహించిన విల్సన్ సుమిత్ర దగ్గరి నుంచి పాపను లాక్కున్నాడు. అనంతరం కిడ్నాప్ చేసిన మహిళను పోలీసులకు అప్పగించారు. విల్సన్ చాకచక్యం వల్లే పాపను రక్షించగలిగాడని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అభినందించారు. మున్సిపల్ కౌన్సిలర్లు గాదెసత్యం, అంకం నరేశ్, నాయకులు ఎడ్ల శంకర్, దామోదర్, అరుణ్, మహమ్మద్, శ్యాంసుందర్, సుధాకర్, ఉమాకాంత్, రాము పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి, పీఈటీలు

# ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

హాజీపూర్, పిభ్రవరి 12 : మండలంలోని వేంపల్లి గ్రామ శివారులోని ఎస్ఆర్‌కేఎం నర్సింగ్ కళాశాలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సీనియర్ పురుషులు, మహిళల హ్యాండ్ బాల్ జట్లను సోమవారం ఎంపిక చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 100 మంది క్రీడాకారులు పాల్గొనగా, అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యామ్‌సుందర్ రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్ తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగే తెలంగాణ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ కోచ్‌లు అరవింద్, రాజలింగు, పీడీలు సదానందం, పద్మ, అలివేలు, పీఈటీలు సంజీవ్, మహేశ్, రమేశ్, కళ్యాణ్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి

# జిల్లా అభివృద్ధికి తోడ్పడాలి

**మంచిర్యాల జడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి**

హాజీపూర్, పిభ్రవరి 12 : అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని జడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయంలో నిర్వహించిన స్థాయీ సంఘాల సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం పలు శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. జడ్పీ సీఈవో నరేందర్, వైస్ చైర్మన్ సత్యనారాయణ, కార్యాలయ సూపరింటెండెంట్లు బాలకృష్ణ,సత్యనారాయణ,శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఇండ్లు ఉన్నట్లు చూపించి.. నకిలీ పత్రాలు సృష్టించి..

**ఆసిఫాబాద్‌లో ప్రభుత్వ భూములు కాజేసేందుకు ఉద్యోగుల రంగం సిద్ధం**

- అధికారుల అండదండలతో 58,59 జీవోల దుర్వినియోగం
- ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో నివాసముంటున్నట్లు రసీదులు.. క్రమబద్ధీకరణకు దరఖాస్తులు
- రెవెన్యూశాఖలో చర్చనీయాంశం

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రభుత్వ భూములను కాజేసేందుకు అధికారులు నకిలీ పత్రాలు సృష్టించి రంగం సిద్ధం చేశారు. ఇళ్లులేక ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని ఏళ్ల తరబడి నివాసముంటున్న పేదలకు న్యాయం చేసే ఉద్దేశంతో గత సర్కారు తీసుకొచ్చిన 58, 59 జీవోలను దుర్వినియోగం చేసి లబ్ధిపొందేందుకు సిద్ధమాయ్యరు. 2016 అక్టోబర్‌లో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఏర్పడిన తర్వాత.. జిల్లాకు వచ్చిన అధికారులు, ఇతర ప్రైవేట్ సంస్థల్లో పని చేసే ఉద్యోగులు.. 2014 కంటే ముందు నుంచే జిల్లాలో నివాసముంటున్నట్లు నకిలీ రసీదులను సృష్టించి, ప్రభుత్వ స్థలాలను స్వాహా చేసేందుకు సర్వం సిద్ధం చేశారు. ఓ జిల్లా స్థాయి అధికారి (ప్రస్తుతం బదిలీ అయ్యారు) అండదండలంతో నకిలీ ధ్రువ పత్రాలు సృష్టించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. కాగా, ఆ జిల్లా స్థాయి అధికారితో పాటు మరికొంత మంది అధికారులు కూడా నకిలీ ధ్రువ పత్రాలతో జీవో 58, 59ల ద్వారా ప్రభుత్వ స్థలాన్ని కాజేసేందుకు యత్నించడం కొసమెరుపు. ఈ విషయం ప్రస్తుతం రెవెన్యూ శాఖలో చర్చనీయాంశంగా మారింది.



ఈ స్థలంలోనే 2014 కంటే ముందు నుంచి ఇండ్లు ఉన్నట్లు.. వాటిలో నివాసముంటున్నట్లు గ్రామ పంచాయితీ నకిలీ రసీదులను సృష్టించారు

## నకిలీ రసీదులు సృష్టించి..

2014 సంవత్సరం కంటే ముందు నుంచి ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న వారికి జీవో 59 ప్రకారం భూములను (125 గజాల విస్తీర్ణం) క్రమబద్ధీకరించడానికి అప్పటి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందుకోసం అనేక మంది దరఖాస్తులు చేసుకున్నారు. కొందరు అధికారులు బీడీపీపీ భూముల్లో నివాసముంటున్నట్లు నకిలీ ధ్రువ పత్రాలను తయారు చేశారు. ఓ ఉన్నతాధికారితో పాటు మరో అధికారి, కొంత మంది కింది స్థాయి ఉద్యోగులు సైతం ఈ స్థలాన్ని క్రమబద్ధీకరించుకునేందుకు అవసరమైన అనుమతులు పొందినట్లు తెలుస్తున్నది. వాంకిడి మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించిన రసీదులపై.. ఆసిఫాబాద్ గ్రామ పంచాయతీకి సంబంధించిన ముద్రను వేసి ప్రభుత్వ ఖాళీ స్థలంలో నివాసముంటున్నట్లు రసీదులు తయారు చేశారు. ఈ విషయంపై రెవెన్యూ శాఖతోపాటు పట్టణ ప్రజల్లో చర్చ జరుగుతున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని, ఎలాంటి విచారణ జరుపడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఓ ఉన్నతాధికారే ఈ విషయంలో చక్రం తిప్పారనేది బహిరంగ రహస్యంగా మారింది. వివిధ ప్రాంతాలకు చెందిన బినామీ పేర్లతో ఏడు ప్లాట్లను దక్కించుకునేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ అధికారి అండదండలతో వివిధ ప్రైవేట్ సంస్థల్లో పని చేసే ఉద్యోగులు కూడా ఈ స్థలంలో ప్లాట్లు పొందేందుకు నకిలీ పత్రాలతో దరఖాస్తులు చేసుకోవడం గమనార్హం.

## భూములకు డిమాండ్ పెరగడంతో..

గతంలో ఆసిఫాబాద్ పట్టణం చుట్టూ ప్రభుత్వం పంచిన భూములు బీడీపీపీ(బిల్ల దాఖల పోరంబోకు-సర్వేచేయని) దాదాపు 800 ఎకరాలకు పైగా ఉన్నాయి. ఇవి పంటలు పండించేందుకు అనుకూలంగా లేకపోవడంతో రైతులు బీళ్లుగా వదిలివేశారు. క్రమేనా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం కావడం, నాలుగు వరుసల హైవే రోడ్డు వేయడంతో ఈ భూములకు విపరీతంగా డిమాండ్ పెరిగింది. ఈ భూమలన్నీ ఆసిఫాబాద్ పట్టణాన్ని ఆనుకొని ఉండడంతో రెవెన్యూ అధికారులు, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, కొంత మంది భూ వ్యాపారులు సర్కారు స్థలాలను కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ తతంగమంతా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినప్పటికీ స్పందించడం లేదు. పైగా ఈ భూములను క్రమబద్ధీకరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. 2014 కంటే ముందు నుంచే ఇక్కడ ఉంటున్నట్లు ధ్రువ పత్రాలు పొందిన విషయమై విచారణ జరిపిస్తే మరిన్ని అవకతవకలు బయటపడే అవకాశాలు ఉన్నాయి.

# సమస్యల పరిష్కారానికి కృషి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 12 : ప్రజావాణి ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆసిఫాబాద్ మండలం మోతుగూడ గ్రామానికి చెందిన ఉప్పరి విజయలక్ష్మి, ఉప్పరి తిరుపతి, బర్ల బానక్క, ఆసిఫాబాద్‌కు చెందిన బాబురావు, డిగ్రీ విద్యార్థి కొండ్ర తిరుపతి ఉపాధి కల్పించాలని కోరుతూ వేర్వేరుగా దరఖాస్తులు అందజేశారు. రెబ్బెన మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన మాదాసు కిష్టయ్య తన తండ్రి నుంచి వారసత్వంగా రావాల్సిన భూమిని తమ పెద్ద అన్న పేరిట నమోదు చేశారని, దీన్ని సవరించి ముగ్గురు అన్నదమ్ములకు సమానంగా పంచాలని కోరుతూ దరఖాస్తు అందజేశాడు. ప్రజావాణి కార్యక్రమానికి అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# డీఆర్‌డీవో, జడ్పీ సీఈవో, అడిషనల్ డీఆర్‌డీవోల బదిలీ



డీఆర్‌డీవో కిషన్



జడ్పీ సీఈవో గణపతి

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 12 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పంచాయత్ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంటులోని అధికారులను బదిలీ చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జడ్పీ సీఈవో, డిప్యూటీ సీఈవోలు, డీఆర్‌డీవో, అడిషనల్ డీఆర్‌డీవోలను, జిల్లా పంచాయతీ అధికారులకు స్థానచలనం కల్పించారు. ఇందులో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీవో) బీ శేషాద్రిని రాజన్న సిరిసిల్లా జిల్లాకు బదిలీ చేయగా, ఆయన స్థానంలో ఆదిలాబాద్ డీఆర్‌డీవో ఎస్ కిషన్‌కు, మంచిర్యాల అడిషనల్ డీఆర్‌డీవోగా ఆదిలాబాద్ అడిషనల్ డీఆర్‌డీవో రవీందర్‌కు బాధ్యతలు అప్పగించారు. అలాగే మంచిర్యాల జిల్లా ప్రజాపరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈవో) కే నరేందర్‌ను పెద్దపల్లి జడ్పీ సీఈవోగా బదిలీ చేస్తూ మంచిర్యాలకు ఆదిలాబాద్ జడ్పీ సీఈవో వీ గణపతికి పోస్టింగ్ ఇచ్చారు. మంచిర్యాల డిప్యూటీ సీఈవో ఆర్ లక్ష్మీనారాయణను ఆసిఫాబాద్ జడ్పీ డిప్యూటీ సీఈవోగా బదిలీ చేశారు.

# గిరిజనుల కష్టాలు తెలుసు

**జిల్లాను పర్యాటకంగా బాగా అభివృద్ధి చేస్తాం..**

- దర్బార్‌ను తెలిపేలా శిలాఫలకం ఏర్పాటు చేయాలి..
- పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- ప్రజా దర్బార్‌కు తరలివచ్చిన గిరిజనులు
- నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు
- మంత్రి, ఎమ్మెల్యేలను సన్మానించిన మెస్రం వంశీయులు



దర్బార్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



దర్బార్‌లో పాల్గొన్న ప్రజలు



నాగోబా దర్శనానికి తరలివస్తున్న భక్తులు



గోవాడ్‌లో మెస్రం వంశీయుల కొత్తకోడళ్లతో చర్చిస్తున్న మంత్రి సీతక్క

ఉట్నూర్/ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 12 : ఏజెన్సీ ప్రాంతాల్లో ఉండే అమాయక గిరిజనుల, ప్రజల కష్టాలు బాగా తెలుసు అని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతరలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా.. మెస్రం వంశీయులు మంత్రి, ఎమ్మెల్యే, అధికారులను సత్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గిరిజనుల సమస్యలు బాగా తెలుసు కనుకనే ఈ జిల్లాకు ఇన్‌చార్జిగా సీఎం రేవంత్‌రెడ్డి నియమించారన్నారు. రాష్ట్రంలో ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి జరగలేదన్నారు. అందుకే సీఎం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నారన్నారు. జిల్లాలో కల్మషం లేని గిరిజన జాతులు, సహజ వనరులు, పర్యటక కేంద్రాలు చాలా ఉన్నాయని తెలిపారు. అందుకే పర్యటకంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడ దర్బార్ ఏర్పాటుకు కారణాలు తెలుపుతూ శిలాఫలకం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

## ఆదివాసుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

నాగోబా జాతర సందర్భంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దరఖాస్తుల స్వీకరణ కేంద్రంలో దర్బార్‌కు వచ్చిన ఆదివాసులు వ్యక్తి రుణాలతోపాటు వివిధ రకాల సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. దరఖాస్తులను అధికారులు శాఖలవారీగా తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

# విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

- డీఈవో యాదయ్య
- మంచిర్యాలలో జిల్లా స్థాయి సైన్స్ పోటీలు



విజేతలతో డీఈవో యాదయ్య

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 12 : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని డీఈవో యాదయ్య అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులను బాలశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు పాఠశాల, మండల, జిల్లా స్థాయిలో 'సుస్థిర భవిష్యత్తు కోసం వైజ్ఞానిక శాస్త్రం' అంశం మీద ఉపన్యాసం, కవితలు, చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహించామన్నారు. ఇందులో సత్తాచాటిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.

## విజేతలు వీరే...

జిల్లా స్థాయిలో నాలుగు విభాగాల్లో ప్రతిభ కనబర్చిన 12 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు డీఈవో యాదయ్య ప్రకటించారు. చిత్రలేఖనంలో... సీహెచ్ తనియా (జడ్పీఎస్ఎస్ దేవాపూర్) మొదటి స్థానంలో నిలువగా, ఎల్ సాయి దీక్షిత్ (జడ్పీఎస్ఎస్ శాంతిఖని) ద్వితీయ, కే అక్షిత (కేజీబీవీ మంచిర్యాల) తృతీయ స్థానంలో నిలిచారన్నారు. పాటల పోటీల్లో... హర్షిత (జడ్పీఎస్ఎస్ అచ్చులాపూర్) ప్రథమ, బీ స్నేహ (జడ్పీఎస్ఎస్ భీమారం), అలేఖ్య (జడ్పీఎస్ఎస్ వెల్గనూర్), కవితల పోటీల్లో... డీ శ్రావ్య (కేజీబీవీ కోటపల్లి) ప్రథమ, ఎం అఖిల (జీహెచ్ఎస్ గర్మిళ్ల) ద్వితీయ, టీ శ్రావణి (జడ్పీఎస్ఎస్ జెండావెంకటాపూర్), ఉపన్యాసం పోటీల్లో... బీ పుష్పలత (టీఎస్‌డబ్ల్యూఆర్ జేసీ బాలికలు, బెల్లంపల్లి) ప్రథమ, అంజి (జడ్పీహెచ్ఎస్ గుడిరేవు) ద్వితీయ, హర్షిత (జడ్పీఎస్ఎస్ అచ్చులాపూర్) తృతీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. వీరంతా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, హెచ్ఎంలు రాజగోపాల్, శ్రీనివాస్, న్యాయనిర్ణేతలు బీ నారాయణ రావు, ఆర్కే ప్రసాద్, శ్రీనివాస్, శ్రీమూర్తి, జ్యోతి, మంజుల, మూర్తి, పోచయ్య, సైన్స్ సెంటర్ నిర్వాహకులు సాయి, సంపత్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్సార్పీ-1 గని ముట్టడి

- కార్మికుడి ఆత్మహత్యాయత్నానికి వేధింపులే కారణమంటూ ఐఎన్‌టీయూసీ ఆగ్రహం



గనిపై నాయకుల మధ్య వాగ్వాదం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 12 : శ్రీరాంపూర్ ఎస్సార్పీ-1గనికి చెందిన జనరల్ మజ్దూర్ కార్మికుడు కొట్టె వెంకటేశ్ ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటనపై ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్మికులు కన్నెర్ర చేశారు. ఈ మేరకు సోమవారం ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు జే శంకర్‌రావు, కుమారస్వామి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి ఆధ్వర్యంలో ర్యాలీ తీసి.. గనిని ముట్టడించారు. మేనేజర్ వేధింపులు తాళలేకే కొట్టె వెంకటేశ్ ఆత్మహత్యాయత్నం చేశారని, దీనిపై యాజమాన్యం వెంటనే స్పందించాలని, ఇకపై వేధింపులు ఉండవని హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని స్పష్టం చేశారు. దీంతో గని ఏజెంట్ గోపాల్‌సింగ్, మేనేజర్ విజయ్‌కుమార్ నాయకులతో మాట్లాడుతూ ఉత్పత్తి, ఉత్పాదకతకు అనుగుణంగానే కార్మికుల విధుల్లో మార్పులు చేశామన్నారు. ఏఐటీయూసీ నాయకులు చెప్పిన వారిని మాత్రమే షిఫ్టుల్లోకి మార్చడమేమిటని ప్రశ్నించారు. దీంతో గనిపైకి చేరుకున్న ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య, సహాయ కార్యదర్శి కొమురయ్య మాట్లాడుతూ కార్మికుల షిఫ్టుల మార్పునకు.. ఏఐటీయూసీకి సంబంధం లేదన్నారు. కాసేపు ఐఎన్‌టీయూసీ, ఏజెంట్ గోపాల్‌సింగ్, ఏఐటీయూసీ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. చివరకు జీఎం చర్చలకు పిలవడంతో ఆందోళన సద్దుమణిగింది. ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి జనక్‌ప్రసాద్, ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, కలవేణ శ్యాం చర్చలు జరిపారు. పాత కార్మికులను.. వారు చేస్తున్న పనుల్లోనే కొనసాగిస్తామని జీఎం సంజీవరెడ్డి హామీ ఇచ్చారు. నాయకులు నీలం సదయ్య, తిరుపతిరావు, అన్‌రెడ్డి తిరుపతిరెడ్డి, సమ్మయ్య, వెంకటేశ్, చిన్నయ్య, కుమారస్వామి, రాజన్న, మహిపాల్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.